# ఎదురు దెబ్బ

ఎ.కె.వి.రత్నమాల

"నాయనా కళాధర్!'' పిలుపు వినిపించడంతో కాళ్లకి గజ్జెలు కట్టుకోబో తున్నవాడల్లా ఆగి తలెత్తి చూశాడతను. ఎదురుగా నటరాజ శర్మగారు 'కళానిలయం'లో ప్రధాన నాట్యాచార్యులు. ఆయనంతటివారు తనని పిలిచేసరికి ఒక్క క్షణం తడబడ్డాడతను. మరుక్షణం చేస్తున్న పని వదిలేసి చటుక్కున లేచి నిలబడ్డాడు.

"ఏంటి గురువుగారూ!'' అడిగాడు.

చేతిలో ఉన్న గజ్జెల్ని పక్కన పెట్టేసి ఇవతలికి వచ్చాడతను.

"చెప్పండి'' ఆయన ముందు నిలబడి చేతులు కట్టుకుంటూ అడిగాడు.

"ఫస్టియర్ వాళ్లకి డాన్స్ నేర్పే స్నేహలత ఇవాళ రాలేదు. అంచేత ఈ పూటకి వాళ్లందరికీ నువ్వు డాన్స్ నేర్పించాలి'' చెప్పారాయన.

వింటున్న కళాధర్‌కి సంతోషంతో ఎగిరి గంతే యాలనిపించింది. ఒక్క గంతులేమిటి? ఆ సంబ రంలో ఏకంగా శివతాండవం చేయాలనిపించింది. కానీ గురువుగారి ముందు అత్యుత్సాహం ప్రద ర్శిస్తే మొదటికే మోసం రావచ్చన్న భయంతో, ఆ భావాల్ని అతి కష్టం మీద అణచుకున్నాడు. "అలాగే గురువుగారూ! ఇదుగో ఇప్పుడే వెడుతు న్నాను'' చెప్పి ముందుకి కదిలాడు.

నిజానికి అందరూ మరీ బిజీగా ఉన్నప్పుడూ టీచర్స్ ఎవరైనా సెలవులో ఉన్నప్పుడూ ఇలా జూనియర్స్‌ని సీనియర్స్‌కి అప్పగించడం సాధార ణంగా ప్రతి ఇనిస్టిట్యూట్‌లోనూ జరుగుతూ ఉండే విషయమే.

అదేకోవలో ప్రస్తుతం కళాధర్‌నీ ఓ అవకాశం వరించింది. అదతనికి అపురూపం కాకపోయినా కాస్త అరుదే. అయితే అలాంటి అరుదైన ఛాన్స్ తనని వెదుక్కుంటూ వచ్చిన సందర్భంలో అతను పిచ్చిపిచ్చిగా సంతోషించడానికి వెనుక గల అసలు కారణం వేరు.

ఫస్టియర్ డాన్స్ క్లాస్‌లో సాధారణంగా ఉడత ల్లాంటి బుడతలే ఎక్కువ. కాస్త ఈడొచ్చిన పిల్లలూ, కన్నెపిల్లలూ కూడా ఉంటారు కానీ కొంచెం తక్కువ.

అదుగో అతను ఎగురుకుంటూ వెళ్ళేది అలాంటి ఆడపిల్లల కోసమే. డాన్స్ నేర్పే వంకతో అందమైన అమ్మాయిల్ని నచ్చిన చోట తాకుతూ కాస్సేపు ఎంజాయ్ చెయ్యచ్చన్నదే కుర్రవయ సులో ఉన్న అతని ఆనందానికి గల అసలు కారణం.

ఫస్టియర్‌లో వాళ్ళ క్లాస్‌రూం అనబడే హాలు దగ్గర పడడంతో ఆలోచనకి స్వస్తి చెప్పి ఇహలోకం లోకి వచ్చాడు కళాధర్. హాల్లోకి అడుగుపెడుతూనే చుట్టూ చూశాడు.

అదే సమయంలో అతని కంటపడిందామె దూరంగా హాల్లో ఓ మూలగా డాన్స్ ప్రాక్టీస్ చేస్తూ. కొత్త చిగుళ్లతో మెరుస్తూ లేలేత పూలతలా ఉన్న ఆ అందానికి కళ్ళు చెదిరిపోయాయతనికి. మరో ఆలోచనేదీ లేకుండా తిన్నగా ఆటు నడిచాడు.

తన మానాన తాను డాన్స్ ప్రాక్టీస్ చేసుకుం టున్న ఆమె...దగ్గరగా వచ్చి నిలబడిన అతన్ని చూసి ఠక్కున ఆగిపోయింది.

"స్కూల్‌కి కొత్తా?''ఆమెని ఎగాదిగా చూస్తూ అడిగాడతను.

అవునన్నట్టు తలూపిందామె.

"పేరేమిటి?'' మళ్ళీ ప్రశ్నించాడు.

"సింహనందిని'' బెదురుబెదురుగా చెప్పింది.

"తీర్మానాలొచ్చా?'' ఆరాతీశాడు.

"వచ్చు'' అన్నట్టు తలూపింది.

"చెయ్యి''ఆజ్ఞాపించాడు.

"తళాంగుతోం! తకతధిగిణతోం...''అంటూ ప్రారంభించి అన్నీ చేసి చూపించింది.

చూస్తున్న అతని కళ్ళు మెరిసిపోయాయి. ఆమె తీర్మానాలు పర్‌ఫెక్ట్‌గా చేసి చూపించినందు క్కాదు..అలా చేస్తున్నప్పుడు ఆమె ప్రతి కదలిక లోనూ ఓ వింత అందం... మరింత ఆకర్షణ కళ్లనిం డుగా కనబడినందుకు.

"సరే! మళ్ళీ ఇదే ప్రాక్టీస్ చెయ్యి'' చెప్పాడు.

అది విని.. అసంతృప్తిగా మొహం పెట్టిందామె.

దాన్ని గమనించాడతను. "ఏం చెయ్యడం ఇష్టం లేదా?'' భృకుటి ముడేసి ప్రశ్నించాడు.

సమాధానం చెప్పడానికి తత్తరపడిందామె. "అంటే.. ఇష్టం లేక కాదనుకోండి. కానీ.. పూర్తిగా వచ్చేశాయి కదా! మళ్ళీ మళ్ళీ వాటినే ప్రాక్టీస్ చేసి సమయం వృధా చేసుకోవడం ఎందుకూ? కనుక...'' అర్థోక్తితో ఆపేసి అతని వైపు చూసింది.

"ఊఁ..కనుక?'' రెట్టించాడు.

"నిజానికి మేడం నాకివాళ తులజ శబ్దం చెబు తానన్నారు. అందుకని మీరు తులజ శబ్దం డిక్టేట్ చేస్తే నేను దాన్ని నోట్స్‌లో రాసేసుకుంటాను. ఎందు కంటే దాన్ని ఈరాత్రి కంఠతా పట్టేస్తే రేపట్నుంచే ప్రారంభించెయ్యచ్చు కదాని'' పూర్తిచేసింది.

సింహనందిని మాటల్లో అంతర్లీనంగా ధ్వని స్తున్న ఆతృతని గమనించేసరికి అతన్లో ఓ చిన్న అనుమానం ప్రవేశించింది. "నీకు డాన్సంటే అంత ఇష్టమా?'' అడిగాడు.

ఆ ప్రశ్నతో ఆమె ముఖంలో కొత్తకళ చోటుచే సుకుంది.

"నాక్కాదు మా అమ్మకి... నేను డాన్స్ చేస్తున్న ప్పుడు అమ్మ మొహంలో కదలాడే ఆనందాన్ని చూస్తుంటే ప్రపంచాన్ని జయించినంత సంబరంగా అన్పిస్తుంది నాకు. అసలు నేను సాధ్యమైనంత తొందరగా డాన్స్ నేర్చుకుని ప్రదర్శనలివ్వాలని ఆత్రపడుతున్నది కూడా అందుకోసమే!'' ఉన్నదు న్నట్టు చెప్పేసింది.

ఆమె చెప్పింది విని ఆలోచనలో పడ్డాడతను. అదంతా ఆమె ఆశయాన్ని అవకాశంగా తీసుకుని నందినిని తనకి అనుకూలంగా మార్చుకోవడం ఎలాగా అన్న దురాలోచన. క్షణం తర్వాత ఓ నిర్ణ యానికి వచ్చిన వాడిలా గట్టిగా నిట్టూర్చి తలెత్తి చూశాడు. ఏం చెబుతాడో అన్నట్టుగా ఆతృతగా అతని వైపే చూస్తోందామె.

"సరే అలాగే చేద్దాం'' అన్నాడతను.

అతనలా అనడమే ఆలస్యం.. పెన్ను, పుస్త కంతో సిద్ధమై పోయిందామె నోట్స్ రాసుకునేం దుకు.

"ప్చ్! నోట్స్‌కాదు. ఏకంగా డాన్సే నేర్పించే స్తాను'' అంటూ జతిని అభినయించి చూపించాడ తను.

అసలే ఆసక్తి గల వ్యక్తి. ఆపైన అమ్మకోసం,

ఆశయం కోసం పాటుపడుతున్న మనిషి కావడంతో అతను వేసిన స్టెప్స్‌ని అరక్షణంలో పట్టేసిందామె. కానీ.. ఆ హడావిడిలో జతి మర్చిపోయింది. ఆమాటే అడిగిందతన్ని "జతి సరిగ్గా గుర్తురావడం లేదు. ఓసారి చెప్తారా" అంటూ.

విసుక్కోలేతను.

మళ్లీ ఓపిగ్గా జతిని చెప్పాడు. ఈసారి జతిని గుర్తుపెట్టుకోగలిగింది గానీ అడుగులు మర్చిపోయింది. ఆమె కన్ఫ్యూజన్ అతనికి అర్థమైంది. కానీ దాన్ని పోగొట్టే ప్రయత్నం చెయ్యలేదు సరికదా

"అలాకాదు..ఇలా" అంటూ "ఇలా కాదు అలా!" అంటూ ఆమెని మరింతగా ఖంగారు పెట్టేశాడు.

ఐదు నిముషాల అతని శిష్యరికంలో అంతకుముందు తను నేర్చుకున్నది కూడా మర్చిపోయినట్లు అనిపించిందామెకు.

సింహానందిని ఆ అయోమయంలో ఉండగానే ముందుకి కదిలాడతను. ఆమె చేతుల్ని తన చేతుల్తో బంధించి పట్టుకున్నాడు.

"ఈ చేతుల్ని ఇలా పైకెత్తి భుజాలకి సమాంతరంగా పక్కకి చాపాలి" ఆమె వెనుక నిలబడి ఊపిరి తగిలేంత దగ్గరగా చేరి తన మొహాన్ని ఆమె మెడ వంపులో పెట్టి సింహానందిని చెవిలో గుసగుసలాడాడు.

ఒళ్ళు ఝల్లుమందామెకి. నిలువెల్లా అసహ్యంతో జలదరించింది. అతి కష్టం మీద అన్నీ ఓర్చుకుంటూ అతను చెప్పిన భంగిమని చెప్పినట్టు పెట్టింది.

"మొదట ఈ కుడి మడమని పక్కకి కొట్టాలి" ఆమె తొడమీద తన అరచేత్తో తట్టి మరీ చెప్పాడు.

ఆ స్పర్శకి ఒళ్లంతా భగ్గుమందామెకి. గుండె మంటని పళ్ళ బిగువున అదిమిపెట్టి "అలాగే" అన్నట్టు తలూపింది.





## మంచిరోజులు

ఇప్పుడు డయానా హైడెన్‌కి మంచిరోజులు వచ్చినట్టున్నాయి. జగదీష్ మవానీ నిర్మాతగా జయరాజ్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న 'అబ్..బస్' చిత్రం షూటింగ్ శరవేగంగా పూర్తవుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన పాటల్నీ ఈమధ్యే బ్యాంకాక్‌లో చిత్రీకరించారు. మంచి కుటుంబ కథతో పెర్‌ఫార్మెన్స్ ప్రధానంగా సాగే ఈ చిత్రం తనకి మంచి పేరు తెస్తుందని, అవకాశాల్ని తెచ్చిపెడుతుందని ఆశిస్తోంది. ఈ చిత్రంలో షవర్ అలీ, అరుణ్‌బక్షీ తదితరులు ఇతర తారాగణం.

"ఈ నడుములో వంపు స్పష్టంగా కనిపించాలి. 'శిల్పం' కరెక్ట్‌గా రావాలి" చెబుతూనే గబుక్కున తన రెండుచేతుల్తో ఆమె నడుమును పట్టుకుని నొక్కి వదిలేశాడు.

అదిరిపడింది సింహనందిని. అతని చర్యల్ని ఇంకా భరించడం ఆమెవల్ల కాకపోయింది. అందుకే చటుక్కున అతన్నుంచి దూరంగా జరిగింది.

"ఏమైందీ?" ఆమె మొహంలోకి చూస్తూ అదోలా అడిగాడతను.

"మనసు పాడైంది" అని ధైర్యంగా చెప్పలేకపోయింది.

"రా ప్రాక్టీస్ చేద్దాం" పిల్చాడు.

వెళ్లాలనిపించలేదామెకి. కానీ తక్షణం అక్కణ్నుంచి తప్పుకోవడమెలాగో అర్థంకాలేదు. ఆలోచిస్తూంటే మెరుపులా తట్టిందో ఉపాయం.

అంతే ఓ నిశ్చయానికి వచ్చిన దాన్లా ముందుకి కదిలింది.

"మీరు జతి పాడండి నేను అభినయించి చూపిస్తాను" తనే చెప్పింది.

కాదనలేదు కళాధర్.

ఆమె ఏం చెప్పినా, ఎలా చెప్పినా మరోగంట వరకూ సింహనందిని తన చేతిలోంచి తప్పించుకుని ఎక్కడికీ పోలేదన్న ధీమా అదంతా. ఆ భరోసాతోనే తాళం వేస్తూ జతిని అందుకున్నాడతను.

దానికి అనుగుణంగా సింహనందిని ఒకటి రెండు స్టెప్స్ వేసిందంతే! ఇక మూడో అడుగు వెయ్యకుండానే మొదలు నరికిన చెట్టులా కుప్పకూలిపోయింది.

చూస్తున్న కళాధర్ భృకుటి ముడిపడింది. "ఏమైంది?" అసహనంగా అడిగాడు.

"కాలు మెలికపడింది. బెణికినట్లే ఉంది. నెప్పెడుతోంది" బాధనటిస్తూ చెప్పింది.

"ఎలాగోలా లేచి నిలబడు" ఆజ్ఞాపించాడు.

"నావల్లకాదు" ఖరాఖండీగా చెప్పేసింది.

ఉసూరుమనిపించిందతనికి. ఇక ఆమెతో లాభంలేదని కూడా అర్థమైపోయింది. అంతే కాలు పట్టుకుని బాధపడుతున్న ఆమెనలాగే వదిలేసి వ ం రో వ్లై ష్ఠు పోయాడు ఇంకో అమ్మాయిని వెతుక్కుంటూ.

కూర్చున్నచోటునుంచే కళాధర్‌ని నిశితంగా గమనించడం ప్రారంభించింది సింహనందిని. ఒక్క తనదగ్గరే కాదు తన వయసున్న ప్రతి అమ్మాయి దగ్గరా అతని ప్రవర్తన అసభ్యంగానే ఉండడంతో చూస్తున్న ఆమె కళ్ళు కోపంతో ఎర్రబారాయి.

శరీరమంతా అవమానంతో దహించుకుపోతున్నట్టు అనిపిస్తూంటే ఆ వేడిలోనే పైకి లేచి వేయినాల్కల అగ్నిశిఖలా ముందుకి కదిలి అక్కణ్నుంచీ బయటపడింది. ఎదురుగా ఉన్న అమ్మాయిని హింసపెడుతూ, వేధిస్తూ తన హడావిడిలో తానున్న కళాధర్ సింహనందిని లేవడాన్ని కానీ, బయటకు వెళ్లడాన్ని గానీ గమనించలేదు.

కాలచక్రంలో అరగంట కదిలిపోయింది. తన ఎదురుగా ఉన్న అమ్మాయిని కంగారుపెట్టీ, భయపెట్టీ, అటు కదిపీ, ఇటు కదిపీ, అక్కడ తాకీ, ఇక్కడ తాకీ తన లేకితనంతో కావలసినంత ఆనందాన్ని అనుభవించీ, తృప్తిపడి...ఇక అక్కడితో ఆ పిల్లని వదిలేసి వెనక్కి తిరిగిన కళాధర్ ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి పిడుగులు మీద పడ్డట్టుగా అదిరిపోయాడు.

అక్కడ...గుమ్మానికి అడ్డుగా నటరాజశర్మగారు నిలబడి ఉన్నారు. ఆ వెనకే సింహనందిని.

ఎర్రబడ్డ మొహం, నిప్పులు చెరిగే కళ్ళతో ప్రళయకాలరుద్రుడిలా కనిపిస్తున్న ఆయన్ని చూస్తూంటే కళాధర్‌కి విషయం మొత్తం అర్థమైపోయింది. "అ...అదికాదు గురువుగారూ!" ఏదో చెప్పబోయాడు.

కానీ ఆయన వినలేదు. చెయ్యెత్తి "ఆగు... ఇంక నువ్వేం చెప్పొద్దు" అన్నట్టుగా సైగ చేశారు.

ఆ సంజ్ఞతో కళాధర్‌కి నోరుపెగల్లేదు.

"గురువంటే దైవంలా ఉండక్కర్లేదు. తండ్రి కానక్కర్లేదు. కనీసం సోదరభావంతో కూడా మెలగనక్కర్లేదు. కానీ చేసే వృత్తిపట్ల గౌరవం, శిష్యుల పట్ల పవిత్రభావం కలిగి ఉంటేచాలు. ఆ సంస్కారం నీలో లేదు. అందుకే పశువాంఛ కలిగిన నీచుడికి గురుత్వం లభిస్తే అప్పుడది ఎంతగా భ్రష్టుపట్టిపోతుందో అంతగానూ దాన్ని దుర్వినియోగం చెయ్యగలుగుతున్నావు. నీలాంటివాటికి కళానిలయంలో నిలబడే అర్హతలేదు. కనుక ఈ క్షణమే నిన్ను బహిష్కరిస్తున్నాను. వెళ్ళిపో" గర్జించారు.

వింటున్న కళాధర్ గుండె గుభిల్లుమంది. అవమానంతో తల వాలిపోయింది. చేసిన తప్పులకి సిగ్గుపడుతూ, ఇక చేసేదేమీ లేనట్టుగా తలవంచుకుని ముందుకి కదిలాడు. ఆ క్షణంలో అతనికి ఒక్క నిజం అర్థమైంది.

'ఎదుటివాళ్ళు అందునా ఆడవాళ్ళ ఆశయసాధనని అవకాశంగా భావించి, వాళ్లని కీలుబొమ్మలు చేసి ఆడించొచ్చనుకునే తనలాంటి వాళ్లకి ఇలాంటి ఎదురుదెబ్బలు తగుల్తూనే ఉంటాయి' అని. నిజమే మరి!

★

